# ఉత్తరాళ్లు

# పెమ్మరాజు సంధ్యారాణి

## (కథా మాలిక-2)

శ్రీవారికి-                                                            రాజమండ్రి

నేనక్కడలేను కదాని ఎటుబడితేఅటు తిరిగి ఏ అర్ధరాత్రో అపరాత్రో ఇంటికి చేరుకోకండి నేను పురిటి కోసమని ఇక్కడికి వచ్చినా నా దిగులంతా మీ కోసమే!

మావదినా పురిటికి పుట్టి టికి వెళ్ళింది
అలాని మా అన్నయ్య బలాదూర్ తిరగడంలేదు బుద్ధిగా కూర్చుని కథలు రాసుకొంటున్నాడు దానివల్ల పేరుకుపేరు వస్తుంది, డబ్బూ వస్తుంది కాబట్టి మీరు కాలాన్ని వృధాచేయక కధలు రాయడం మొదలు పెట్టండి ఒక్క కధయినా మీది ప్రచురణార్హతని పొందితేనే నేను మళ్ళీ అక్కడికి వచ్చేది గుర్తుంచుకోండి.

మీ శ్రీమతి

శ్రీమతిగారూ-                                                            విజయవాడ

మీకోరిక నెరవేరింది. మనకి అబ్బాయి పుట్టాడన్న తియ్యటివార్తను నువ్వు రాస్తే, నామొదటికధ ప్రచురించబడిందనే తియ్యటివార్త నేను రాస్తున్నాను కధని కూడా పంపుతున్నాను మరి నువ్వెప్పుడు బయలుదేరి వస్తున్నావు? నీజాబుకోసం ఆత్రంగా ఎదురు చూస్తుంటాను.

నీ రఘు

శ్రీవారికి                                                                                    రాజమండ్రి

మీరు రాసిన కథ ప్రచురణార్హతని పొంద ప్రచురింప బడినందుకు సంతోషం కానీ ఆకథ ఇతి వృత్తమే నన్ను బాధ పెట్టింది. వేశ్యల గురించి అన్ని విషయాలు మీకెలా తెలుసు? నాకు భయంగావుంది. మీరు రోజు ఎన్నింటికి ఇంటికి వస్తున్నారు? పైగా కథలో 'నేను' అంటూ ఫస్టుపర్సన్‌లో రాసుకున్నారు అలా రాయడానికి సిగ్గనిపించలేదూ? మా అన్నయ్య ఎన్నో కధలు రాసాడు కానీ ఇలాంటి కధల్ని వాడెప్పుడు రాయలేదు. మీలో మళ్ళీ మంచి మార్పు వచ్చిందని తెలిసినప్పుడే నే నక్కడికి వస్తాను అంత వరకూ రాను.

రాధ

శ్రీమతిగారూ-                                                                                    విజయవాడ

ఆఖర్న 'మీశ్రీమతి' అనకుండా 'రాధ'- అని రాయడంలోనే నీకెంత కోపం వచ్చిందో నాకు అర్ధమై పోయింది. గట్టిగా వుత్తరం రాయడమే చేతగాని నేను ఇంత త్వరలో ప్రచురణార్హమైన కధని ఎలా రాయగలననుకున్నావ్? నీ కోరిక, ప్రతిజ్ఞ మీ అన్నయ్యకి రాసి శరణు వేడాను ఆయన ఓ కధని రాసి నా పేరున పంపారు అదే నీకు పంపినకధ. కాబట్టి అది ఎవరి అనుభవమో నువ్వే వూహించుకో నువ్వు వెంటనే బయల్దేరి రాకపోతే నీ అనుమానం నిజమే అవుతుంది అర్ధమైందా?

మీ శ్రీవారు.

